ఆదివారం ఆటవిడుపు


పిల్లలతో సందడిగా సరస్వతి పార్కు

దాబాగార్డెన్స్: అసలే ఆదివారం. ఆపై చల్లని వాతావరణం. ఇంకేముంది..పిల్లలకు జోష్ వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం పొద్దు పోయే వరకు ఆట పాటల్లో నిమగ్నమయ్యారు. నగరంలో ఎక్కడ చూసిన పిల్లల సందడే. ఏ పార్కు చూసినా..ఖాళీ స్థలాలు..అపార్టుమెంట్ల సెల్లార్లలో పిల్లల ఆటలతో సందడిగా కనిపించింది.

నగరంలోని ద్వారకానగర్‌లోని డైమండ్ పార్కు, డాబాగార్డెన్స్‌లోని సరస్వతి పార్కుతో పాటు నియోజకవర్గ పరిధిలో గల పలు పార్కులు ఆదివారం పిల్లలతో కళకళలాడాయి.

పార్కుల్లో ఆటపరికరాలతో..

డైమండ్‌పార్కు, సరస్వతి పార్కులో జీవీఎంసీ ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు అన్ని వర్గాల ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని ఇస్తున్నాయి. రెండేళ్ల బాలుడు నుంచి ఏడు పదులు వయస్సు మీరిన వారు కూడా మానసిక ఉల్లాసం కోసం జీవీఎంసీ ఏర్పాటు చేసిన అన్ని వ్యాయామ పరికరాలను వినియోగించుకుంటున్నారు.

లెగ్ ఎక్సర్‌సైజ్, బాడీ బిల్డింగ్, హ్యాండ్ ఎక్సర్‌సైజ్, వాకింగ్, స్టమక్ ఎక్సర్‌సైజ్ వంటి పరికరాలు ఏర్పాటు చేశారు.


ఆటలాడుకుంటూ..


చిన్నారులను ఆడిస్తూ..

పిల్లలు..పెద్దలు కూడా: పిల్లలతో పాటు పెద్దలు.. వృద్ధులు కూడా పార్కుల్లో ఏర్పాటు చేసిన పరికరాలు ఉపయోగించుకుంటున్నారు. పార్కుల్లో ఫిట్‌నెస్ పరికరాలు ఏర్పాటు చేయడంతో పిల్లలను వెంటబెట్టుకుని వస్తున్నారు. డైమండ్‌పార్కు, సరస్వతి పార్కుల్లో ఆదివారం నాడు వేకువ జాము 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు కిటకిటలాడుతున్నాయి.

క్లుప్తంగా

ఎర్నిమాంబకు అష్టమి పూజలు


ఎర్నిమాంబకు హారతులు ఇస్తున్న అర్చకుడు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలోని వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ మాస శుద్ధ అష్టమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవాదాయశాఖ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నార్తులకు ఆహారం పంపిణీ


ఆహారం ప్యాకెట్లు అందిస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: సేవా కార్యక్రమంలో భాగంగా దళిత సేన ఆధ్వర్యంలో ఆదివారం అన్నార్తులకు ఆహారం పొట్లాలు అందజేశారు. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన కింద, జ్ఞానాపురం రైల్వే స్టేషన్, దొండపర్తి, తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో సామాజిక వేత్త, దళిత సేన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొల్లమాల అప్పారావు ముఖ్య అతిథిగా సుమారు 350 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర కన్వీనర్ మీనా, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, నగర సెక్రటరీ పట్నాల ఝాన్సీ, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్, రాణి తదితరులు పాల్గొన్నారు.

11న ఉచిత కంటి వైద్య శిబిరం

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధి 39వ వార్డులోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో ఈ నెల 11న శంకర ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న వైద్య శిబిరంలో స్థానికులు పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు చేసుకోవచ్చని, అవసరమైన వారికి అదే రోజున శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయనున్నట్టు చెప్పారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వన్‌టౌన్ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


తులసి మొక్కల పంపిణీ

ఎంవీపీ కాలనీ: రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో పెదజాలరిపేటలోని రామాలయం వద్ద ఆదివారం విద్యార్థులకు తులసి మొక్కలు, రామకోటి పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భగవద్గీతపైన అవగాహన కల్పించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు మొక్కలు, పుస్తకాలు పంపిణీ చేసినట్టు క్లబ్ కార్యదర్శి రవికుమార్ తెలిపారు.

జిల్లా స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలు ప్రారంభం

పెదగంట్యాడ: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్, కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు అక్టోబర్‌లో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడ విజయం సాధించిన వారు నవంబర్‌లో విశాఖలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

బీచ్ రోడ్డు.. బ్యూటీఫుల్


ఐటీ జంక్షన్ వద్ద సుందరంగా తీర్చిదిద్దిన బీచ్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రోజురోజుకూ మరింత సుందరంగా ముస్తాబవుతోంది. ఇప్పటికే డివైడర్లకు, సైడ్ వాల్స్‌కు, ఫుట్ పాత్‌లకు వివిధ వర్ణాలతో అద్భుతమైన కళాకృతులతో రంగులు అద్దారు. విద్యుత్ దీపాలతో రాత్రి సమయాల్లో మరింత అందంగా కనిపిస్తుంది. దీనికితోడు ఆదివారం ఐటీ జంక్షన్ కల్వర్టు వద్ద ఐరన్ బాక్స్‌లలో నల్లరాళ్లు ఏర్పాటు చేయడంతో మరింత సుందరంగా కనిపిస్తోంది.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన


దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

దాబాగార్డెన్స్: అసోసియేషన్ ఆఫ్ అలయెన్స్ క్లబ్ విశాఖపట్నం నార్త్, బాల వికాస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఫిషింగ్ హార్బర్ బీచ్‌రోడ్డు బుక్కావీధిలోని బ్రిడ్జి స్కూల్లో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ కె. శ్రీకాంత్ నేతృత్వంలో దంత సంరక్షణ, ఆరోగ్యంపై అవగాహన, దంత సమస్యలు చిన్నవిగా ఉన్నప్పుడే తగిన చికిత్స చేయించుకోవాలని సూచించారు. ప్రతి వారికి బ్రష్, టూత్‌పేస్ట్ ఉచితంగా అందజేశారు. సుమారు వంద మందికి పైగా స్థానికులు పాల్గొన్నారు. శిబిరాన్ని జిల్లా గవర్నర్ విద్యాసాగర్ ప్రారంభించారు. సమావేశంలో క్లబ్ సభ్యులు కె.గాంధీ, డి.పోలారావు, ఉషారాణి, క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ కల్యాణ మండపం వార్షికోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న కంకటాల మల్లిక్

దాబాగార్డెన్స్: పాత నగరం వన్‌టౌన్ ప్రాంతం వుడ్ యార్డ్ స్ట్రీట్‌లోని వాసవీ కల్యాణ మండప సంఘం 52వ వార్షికోత్సవం ఆదివారం మండపం ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కంకటాల మల్లిక్ పాల్గొని మాట్లాడారు. ఐదు దశాబ్దాలుగా ఆర్యవైశ్యులకు సేవలందిస్తున్న కల్యాణ మండప సంఘాన్ని అభినందించారు. కల్యాణ మండప సంఘం అధ్యక్షుడు విన్నకోట రామ్మూర్తి మాట్లాడుతూ ఐదు దశాబ్దాల క్రితం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా పేద, మధ్యతరగతి ఆర్యవైశ్యుల కుటుంబాల శుభకార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా అద్దేపల్లి నరసింహారావు వ్యవస్థాపక అధ్యక్షతన ఏర్పాటైందన్నారు. అనంతరం వంకాయల లక్ష్మీకాంతమ్మ విరాళంతో కల్యాణమండపాన్ని అభివృద్ధి చేయడమే గాక అధునాతన సౌకర్యాలు కల్పించారన్నారు. ఈ సందర్భంగా కల్యాణ మండపం అభివృద్ధికి సహకరించిన పలువుర్ని సత్కరించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి కందుల మూర్తి, వార్షికోత్సవ కమిటీ చైర్మన్ పట్నాల వెంకట్‌రెడ్డి, మామిడి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా తప్పనిసరి


సదస్సులో పాల్గొన్న అతిథులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్(వైసీటీ)తో సంయుక్తంగా ఏయూ అనుష్టాన యోగ వేదాంత ఫర్ హోలిస్టిక్ లివింగ్ అంశంపై ఈ సదస్సు నిర్వహించాయి. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన తప్పనిసరని చెప్పారు. ఈ సదస్సులో 200 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. బెంగళూరు వ్యాస యూనివర్సిటీ వీసీ డాక్టర్ నాగేంద్ర మానవులలో పెరిగే మానసిక ఒత్తిడి పర్యవసానాలు–ఆరోగ్య సమస్యలు అంశంపై ప్రసంగించారు. వ్యక్తి ఆరోగ్యానికి యోగా ఉపకరిస్తున్న పద్ధతులను తెలియజేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు మాట్లాడుతూ యోగా కేంద్రం విశ్వవిద్యాలయానికి అతిపెద్ద వనరుగా నిలుస్తోందన్నారు. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ టి.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ ఒత్తిడిని నివారించడం, నియంత్రించడంలో యోగా విధానాలు, ఉపయోగాలు తెలియజేశారు. సదస్సు కన్వీనర్ ఆచార్య కె.రమేష్‌బాబు, సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ సి.శ్రావణి, డాక్టర్ ఆర్.తులసీరావు, డాక్టర్ జ్యోత్స్న అగర్వాల్, డాక్టర్ డి.వెంకటరావు, ఆచార్య పి.రవీంద్రనాథ్, డాక్టర్ శ్రీ కృష్ణ, డాక్టర్ సునీత, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణ పుష్పాలు


నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా స్వర్ణపుష్పార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 వరకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేణపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని జరిపించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

అందం.. ఆహ్లాదకరం

- వార్డుల అభివృద్ధికి ప్రతీకలు పార్కులు
- వాకింగ్, వ్యాయామం పరికరాలతో కళకళ
- 16వ వార్డులో సుందరంగా విద్యానగర్ కాలనీ పార్కు


పార్కులో షటిల్ కోర్టు, వాకింగ్ ట్రాక్


16వ వార్డు విద్యానగర్ పార్కులో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు

మద్దిలపాలెం: అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే పార్కులు నేడు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఎన్నో ఏళ్ల తర్వాత సుందరంగా తీర్చిదిద్దడంతో నగరంలోని కాలనీలకు కొత్త కళను తీసుకొచ్చాయి. అందం.. ఆహ్లాదం.. ఆరోగ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. జీవీఎంసీ 16వ వార్డు విద్యానగర్ కాలనీలో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్న పార్కును కార్పొరేటర్ మొల్లి లక్ష్మి చొరవతో మంజూరైన జీవీఎంసీ నిధులతో సుందరంగా ముస్తాబు చేసి పూర్వ వైభవం తీసుకొచ్చారు.

రూ.12 లక్షలతో వసతుల కల్పన

సుమారు 30 ఏళ్ల క్రితం భానునగర్ కాలనీలో విద్యానగర్ పార్కును నిర్మించారు. తరువాత నిర్వహణను గాలికి వదిలేయడంతో పార్కు గోడలు శిథిలమైపోయాయి. పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అప్పుడప్పుడు కాలనీవాసుల సహకారంతో తుప్పలు తీసినా పార్కులోకి రావడానికి ఎవరూ ఆసక్తి చూపేవారు కాదు. 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తొలి ఏడాదిలోనే విద్యానగర్ పార్కు అభివృద్ధికి రూ.12 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ నిధులతో పార్కులో పలు వసతులు కల్పించి, అభివృద్ధి చేశారు. పార్కులో వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టు నిర్మించారు. పార్కు చుట్టూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించారు. కాసేపు కూర్చొని సేద తీరడం కోసం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. శిథిలమైన పార్కు గోడలను పునర్నిర్మించారు.

వాటికి పెయింటింగ్ వేసి అందంగా తీర్చిదిద్దారు. దీంతో కాలనీకి విద్యానగర్ పార్కు మణిహారం మారింది.

వార్డులో పార్కుల అభివృద్ధికి పెద్ద పీట



వార్డులో ప్రధాన సమస్యలను గుర్తించి దశల వారీగా పరిష్కరిస్తున్నాం. కాలనీ మధ్యలో అధ్వానంగా ఉన్న పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. దీనిలో భాగంగా విద్యానగర్ పార్కును రూ.12 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశాం. ఇదే వార్డులో గెజిటెట్ ఆఫీసర్ కాలనీలో శిథిలమైన పార్కులో మరో రూ.12 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాం. పార్కులను ప్రజలు సద్వినియోగం చేసుకుని, నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలి.

– మొల్లి లక్ష్మి, 16వ వార్డు కార్పొరేటర్

మొక్కలు నాటిన వర్సిటీ అధికారులు


మొక్క నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వర్సిటీ అధికారులు మొక్కలు నాటారు. ఆదివారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి స్వయంగా పాల్గొని కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగం వెనుక భాగంలో నూతనంగా అభివృద్ధి చేసిన రహదారికి ఇరువైపులా వేప, కదంబం, నాగలింగం, పొన్న, పొగడ, వెలగ, గంగావలి, రేల, జకరందం, రావి, మర్రి, అడవి జువ్వి తదితర జాతులకు చెందిన మొక్కలను నాటారు. త్వరలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు, డీన్ ఆచార్య జి.వీర్రాజు, శ్రీధర్, డాక్టర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలని వినతి

ఎంవీపీ కాలనీ: శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని శిష్టకరణ సాధన సమితి నాయకులు కోరారు. ఈ మేరకు సమితి నాయకుడు ఎన్.గజపతి రావు ఆధ్వర్యంలో 200 మంది శిష్టకరణాలు ఆదివారం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును లాసన్స్‌బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గజపతిరావు మాట్లాడుతూ ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన ఓబీసీ జాబితాలో శిష్టకరణ సామాజిక వర్గం ఉన్నట్లు తెలిపారు. అయితే ఆ జాబితాను అధికారికంగా ఆమోదించాల్సిన అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో జాబితా ఆమోదానికి కృషి చేయాలని జీవీఎల్‌ను కోరారు. దీనిపై ఎంపీ జీవీఎల్ మాట్లాడుతూ రానున్న శీతాకాల సమావేశంలో ఈ విషయంపై పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి జాతీయ అధ్యక్షుడు బెనర్జీ, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో విజిబుల్ పోలీసింగ్


బీచ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగదాంబ: పర్యాటకుల సంరక్షణ నేపథ్యంలో సాగరతీరాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. రద్దీగా ఉండే ఆర్కేబీచ్, రుషికొండ బీచ్ వద్ద పర్యాటకులను అలెర్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు మరింత నిఘా పెంచారు.

బీచ్‌లో స్వచ్ఛ భారత్


తీరంలో చెత్త సేకరిస్తున్న ఏబీవీపీ సభ్యులు

భీమునిపట్నం: స్థానిక బీచ్‌లో ఆదివారం అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) భీమిలి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు బీచ్‌లోని చెత్త సేకరించారు. రాష్ట్ర కో కన్వీనర్ లొడగల అచ్చిబాబు మాట్లాడుతూ ఏబీవీపీ 75వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందన్నారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని, సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.

క్రీడలతో బంగారు భవిష్యత్తు


రోల్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి

మురళీనగర్: విద్యార్థులు క్రీడల్లో పాల్గొని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కళ ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి అన్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను పార్క్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. ముందుగా రమణమూర్తి టాస్ వేసి టీమ్‌లకు రోల్‌బాల్‌ను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 3వ జిల్లా స్థాయి అండర్ 11, అండర్ 14 పురుషులు, మహిళల రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో 200 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. విజేతలకు పైడి వెంకటరమణమూర్తి, సనపల వరప్రసాద్ ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్క్ అసోసియేషన్ కార్యదర్శి పొట్నూరు నాగరాజు, శాంతి భూషణ్, సురేష్, సూర్యనారాయణ, సౌత్ ఇండియా రోల్ బాల్ కోచ్ అనిల్, విశాఖపట్నం రోల్‌బాల్ కోచ్ పి.సంతోష్ పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు


యువతకు పుస్తకాలు అందిస్తున్న హేమంత్‌కుమార్

సీతమ్మధార: ఉద్యోగ వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచి మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ కోరారు. ద్వారకానగర్‌లోని వినాయకుడి గుడి వద్ద ఆదివారం నిరుద్యోగ యువతకు కాంపిటీటివ్ బుక్స్, అరకు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం పోటీ పరీక్షల మెటీరియల్‌ను అభ్యర్థులకు ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రూప్–2, అన్ని కాంపిటేటివ్ పోటీ పరీక్షలకు సంబంధించి మెంటల్ ఎబిలిటీ పుస్తకాలను యువతకు ఇచ్చినట్లు చెప్పారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు గత సచివాలయ తరహాలో 15 గ్రేస్ మార్కులు వేసి ఆదుకోవాలని. ప్రతి నిరుద్యోగికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగంగా ఉచిత సడీ మెటీరియల్ ఇవ్వాలని కోరారు.